ప్రజాశక్తి
మంగళవారం 11 మార్చి 2025 | 5 | కర్నూలు

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

- సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడించిన పేదలు
- 15 రోజుల్లోపు తేల్చకుంటే గుడిసెలు వేస్తాం
- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ హెచ్చరిక

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ భూములను గద్దల్లాగా కబ్జా చేస్తున్న వారిపై అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి భూముల్లో ఇళ్ల స్థలాల కోసం గుడిసెలు వేసేందుకు వెళ్తున్న పేదలను అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. 15 రోజుల్లోగా పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కలెక్టర్‌ను డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం నాయకత్వంలో ఇళ్ల స్థలాల కోసం కలెక్టరేట్‌ను పేదలు ముట్టడించారు. ఎర్రని ఎండను సైతం లెక్కచేయకుండా నాలుగు గంటల పాటు మాకు స్థలాలు చూపండి అంటూ కర్నూలు కలెక్టరేట్ ముందు పేదలు బైఠాయించారు. పెద్దలు ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేసుకుంటున్నా గుడ్లప్పగించి చూస్తున్న అధికారులు, పేదలు ప్రభుత్వ భూమిలో ఉండేందుకు ఇండ్లేసుకుంటామంటే స్పందించరు ఎందుకని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళన వద్దకు అధికారులు ఎంత సేపటికి రాకపోవడంతో గేట్లెక్కి మేమే లోపలికి వస్తామంటూ దూసుకుపోయారు. పోలీసులు జోక్యం చేసుకొని జిల్లా రెవెన్యూ అధికారిని పిలిపించి సమస్యను సద్దుమణిగించారు. వినతిపత్రం స్వీకరించిన తర్వాత అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని ఆర్‌డిఒ వెంకటనారాయణమ్మ హామీఇచ్చారు. కర్నూలు, కల్లూరు మండలాల్లో అన్యాక్రాంతమవుతున్న భూములకు సంబంధించిన వివరాలను డిఆర్‌ఒకు తెలియజేయడంతో పాటు, సర్వే నెంబర్ 70/2బిలో ఉన్న 16.85 ఎకరాలు, సర్వే నెంబర్ 68లో ఉన్న 12.75 ఎకరాల భూమిలో పేదలకులేఅవుట్ వేసి వెంటనే స్థలాలు ఇవ్వాలని తెలిపారు. అంతకుముందు సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన మహాధర్నానుద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల, ఎమ్‌డి.ఆనంద్‌బాబు, పిఎస్.రాధాకృష్ణ, టి.రాముడు మాట్లాడారు. 15 ఏళ్లుగా ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించడంలో పాలకులు ఎవరైనా సరే పూర్తిగా విఫలమయ్యారన్నారు. రూ.లక్షల కోట్లు తగలబెడుతూ ఊరికి దూరంగా ఎలాంటి సౌకర్యాలు లేనిచోట స్థలాలు చూపుతూ, ఇండ్లు కడుతూ ప్రజలకు ఏమాత్రం ఉపయోగం లేకుండా చేస్తున్నారన్నారు. పాలకులు మారినప్పుడల్లా ఇండ్ల పేరుతో తమ సొంత మార్కును చూపించుకోవడం కోసం ఆరాటం తప్ప, ప్రజలకు ఆవాసాలు మాత్రం దక్కలేదన్నారు. 2007లో ఎమ్మెల్యే ఉన్న ఎంఎ.గఫూర్ చొరవతో రాష్ట్రంలో ఏ జిల్లాకు లేనన్ని ఇంటి స్థలాలను కర్నూలు నగరానికి కేటాయింప చేయించుకున్నా.. ఆ తర్వాత వచ్చిన పాలకులు వాటిని పేదలకు నివాసయోగ్యాలుగా మార్చడంలో విఫలం చెందారన్నారు. జగన్నాథ గట్టులో 8,000 మందికి ఇళ్ల స్థలాలు ఇస్తే, వాటికి నిధులు మంజూరు చేయకుండా, సౌకర్యాలు కల్పించకుండా పాడుపడ్డ మొండి గోడలుగా మిగిల్చారన్నారు. గత పాలకులు పట్టాలంటూ పేపర్లు చేతిలో పెట్టి రుద్రవరం, పందిపాడు లాంటి ప్రాంతాలకు తరలి వెళ్లాలని చెబుతున్నారన్నారు. గ్రామాల్లో బతకలేక పట్టణ ప్రాంతాలకు వలస వచ్చి అద్దెలు చెల్లించలేక ఇబ్బంది పడుతున్న పేదలకు పనులకు అనుకూలమైన స్థలాలను కేటాయించి ఇవ్వకుండా ఆ స్థలాలను రియల్ ఎస్టేట్ గద్దలు తన్నుకు పోతున్నా పాలకులు చోద్యం చూస్తున్నారన్నారు. ప్రభుత్వ భూములను రాజకీయ నాయకుల తాబేదారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు రెవిన్యూ అధికారులు, పోలీసు అధికారులు సైతం కబ్జాలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ జోక్యం చేసుకొని పేదలు స్వాధీనం చేసుకున్న భూమిలోనే ఇళ్ల స్థలాలు వెంటనే ఇవ్వాలని లేకపోతే 15 రోజుల్లో సిపిఎంగానే పేదలకు గుడిసెలు వేసి నివాసయోగ్యం కల్పిస్తామని హెచ్చరించారు. సిపిఎం జిల్లా నాయకులు వై.నగేష్, ఎన్.అలివేలు, కె.అరుణ, విజయ రామాంజనేయులు, సాయిబాబా, నరసింహులు, రామకృష్ణ, అబ్దుల్ దేశాయ్, షరీఫ్, సుభాన్, సుధాకరప్ప, సాయి, ఎన్‌జి కృష్ణ, రఫీ, వేలాదిమంది ప్రజలు పాల్గొన్నారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వేతనాలు రాకుంటే బతికేదెలా..?

-తిండయినా పెట్టండి..కూలయినా ఇవ్వండి...
-పెండింగ్ వేతనాలివ్వకుంటే కలెక్టరేట్ ముట్టడిస్తాం
- వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కూలీల నిరసన

ప్రజాశక్తి -కర్నూలు క్రైమ్

జిల్లాలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు తొమ్మిది వారాలుగా వేతనాలు రావడం లేదని, వెంటనే వారి వేతనాలు చెల్లించాలని, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి నారాయణ డిమాండ్ చేశారు. కర్నూలు మండలం, ఈ తాండ్రపాడు గ్రామంలో కె.వి నారాయణ, మండల కార్యదర్శి పిబి ఉషనయ్య, గ్రామ సర్పంచి ఎస్.బాలపీరాలతో కలిసి ఉపాధి హామీ కూలీల దగ్గరికి వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేతనాలు రాకుంటే బతికేదెలా?,తిండయినా పెట్టండి..కూలయినా ఇవ్వండి..., పెండింగ్ వేతనాలివ్వకుంటే కలెక్టరేట్ ముట్టడిస్తాం, అంటూ వ్యవసాయకార్మిక సంఘం ఆధ్వర్యంలో కూలీలతో నిరసన తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ 9 వారాలైన పని చేసిన కూలీలకు వేతనాలు రాకపోతే ఏం తిని బతకాలని అన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు నెలనెలా వేతనాలు తీసుకుంటూ పేదలను మాత్రం పస్తులు ఉంచుతున్నారని విమర్శించారు. చాలా కుటుంబాల్లో ఎక్కువ మంది పనిచేయడం వల్ల పని దినాలు పూర్తి అయిపోయాయని, అదనంగా పది దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉపాధి కూలీకి పనిముట్లు, మెడికల్ కిట్లు, టెంట్లు ఇవ్వాలని కోరారు. వ్యవసాయ కూలీ కుటుంబం రెండెకరాల లోపు భూమి ఉన్న కుటుంబానికి సంవత్సరానికి రూ.12వేల ఆర్థిక సహాయం అందించాలని అన్నారు. పై డిమాండ్ల సాధన కోసం ఈనెల 12న విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తున్నామని దీనికి జయప్రదం చేయాలని కోరారు. తక్షణం జిల్లా అధికార యంత్రాంగం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి వేతనాలు అందించే ప్రయత్నం చేయాలని, లేని పక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామనిహెచ్చరించారు.

నిరసన చేపడుతున్న కూలీలు, నాయకులు

పి4 సర్వే గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెసి, డిఆర్‌ఒ

పేదరికం లేని సమాజ నిర్మాణమే లక్ష్యం

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా
- గ్రీవెన్స్ లో బాధితులనుంచి అర్జీలను స్వీకరణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పేదరికం లేని సమాజ నిర్మాణం పి4 విధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ – పిజిఆర్ఎస్) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వచ్చిన వినతులను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం వచ్చిన అర్జీలను వెంటనే పోర్టల్‌లో రిజిస్టర్ చేయమని చెప్పినప్పటికీ ఇంకా కొన్ని మండలాల్లో నమోదులో జీరో ఉండడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అర్జీలు వచ్చిన వెంటనే పోర్టల్ లో నమోదు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

మహిళా సంఘాలు భాగస్వాములు కావాలి

ప్రకృతి వ్యవసాయంలో మహిళా సంఘాల సభ్యులు భాగస్వాములై ప్రకృతి వ్యవసాయ విస్తరణకు తోడ్పడాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా పిలుపునిచ్చారు.' ప్రజా భాగస్వామ్య పకృతి వ్యవసాయం – నవ సార్వత్రిక సూత్రాలు' , 'ప్రకృతి వ్యవసాయ విస్తరణలో మహిళా సంఘాలు ఆచరించవలసిన సప్త సూత్రాలు' అన్న వాల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ప్రభుత్వ, దాతల, ప్రజల భాగస్వామ్యం పి4తో 'ప్రతి ఇంటికి అభివృద్ధి, ప్రతి జీవితానికి ప్రగతి' అనే వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్‌ఒ సి.వెంకట నారాయణమ్మ, సిపిఒ హిమ ప్రభాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు

- హెల్మెట్ ధారణపై ఆటో అనౌన్స్ మెంట్ ర్యాలీని ప్రారంభించిన ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు, రహదారి భద్రత నిబంధనల పై ప్రణాళిక బద్ధంగా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని కర్నూలు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ తెలిపారు. సోమవారం కర్నూలు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్మెట్ అవగాహన పై ఆటో అనౌన్స్ మెంట్ ర్యాలీ, అధునాతన ట్రాఫిక్ నియంత్రణ పరికరాలను, కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద ఎస్‌పి విక్రాంత్ పాటిల్ జెండా ఊపి ప్రారంభించారు. విలేకరులతో ఎస్‌పి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ కర్నూలు పట్టణంలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో 15 ఆటోలతో ట్రాఫిక్, హెల్మెట్ ధారణపై అవగాహన బ్యానర్లతో , ఒక రోజు ఆటో అనౌన్స్ మెంట్ ర్యాలీ నిర్వహించేందుకు ఆటో యూనియన్ వారు స్వచ్ఛంధంగా ముందుకు వచ్చారన్నారు. రద్దీ ప్రాంతాలలో హెల్మెట్ పై అవగాహన చేస్తూ , సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్‌తో ఆటో లు తిరుగుతూ కర్నూలు పట్టణ ప్రజలకు అవగాహన కల్పిస్తాయన్నారు. కర్నూలు ఆటో యూనియన్ వారికి జిల్లా ఎస్‌పి కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక భాద్యత కలిగిన దాతల సహకారంతో రద్దీ ప్రాంతాలైన బళ్ళారి చౌరస్తా, బస్టాండు వంటి పలు ప్రదేశాలలో 4 అధునాతన డిజిటల్ బ్యానర్స్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఈ డిజిటల్ బ్యానర్స్ హెల్మెట్ ధారణ గురించి, మద్యం సేవించి వాహనాలు నడపకూడదనే ట్రాఫిక్ నిబంధనల గురించి తెలియజేస్తాయన్నారు. రాత్రి వేళల్లో విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులకు రేడియం జాకేట్స్‌ను , 125 మూవబుల్ బారికేడ్స్ ను ఇచ్చారన్నారు. కర్నూలు బి. క్యాంపు కు చెందిన మహిళా ఆటో డ్రైవర్ గౌతమి మాట్లాడుతూ...ఇంట్లో పరిస్థితులు సరిగా లేకపోవడంతో ఉద్యోగం చేయడం ఇష్టం లేక ఆటో యూనియన్ వారి సహకారంతో ఆటో డ్రైవింగ్ ఫీల్డ్ ఎంచుకున్నానన్నారు. మహిళలు ఇంట్లోనే ఉండిపోకుండా ధైర్యంగా ఏదో ఒక వృత్తిలో రాణించాలన్నారు. మైనర్ పిల్లలు డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాల బారిన పడి తల్లిదండ్రులను బాధలకు గురి చేస్తున్నారన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించకుండా, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వావాహనాలు నడపాలన్నారు. అనంతరం (1. సిఎంఆర్ – ప్రేమ్ రెడ్డి, సత్యనారాయణ, చందన బ్రదర్స్ – నాగ మునేశ్వరరావు, శశిధర్ రెడ్డి, నాగార్జున సిమెంట్ – సాంబశివారెడ్డి, సినియర్ మేనేజర్ , శ్రీశైలం ఆర్ఎం సి– కోటిరెడ్డి దాతలకు జిల్లా ఎస్‌పి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ హుస్సేన్ పీరా, ఎఆర్ అడిషనల్ ఎస్‌పి కృష్ణమోహన్, డిఎస్‌పిలు బాబు ప్రసాద్, భాస్కర్ రావు, సిఐలు మన్సురుద్దీన్, తేజమూర్తి, కేశవరెడ్డి, అబ్దుల్ గౌస్, రామయ్యనాయుడు, నాగరాజా రావు, గుణశేఖర్ బాబు , ట్రాఫిక్ పోలీసులు, ఆటో యూనియన్ వారు ఉన్నారు.

హెల్మెట్ ధారణపై ఆటో అనౌన్స్ మెంట్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

మూడేళ్లయినా ఇపిఎఫ్ పెన్షన్ లేదు!..

-లైన్‌మెన్ మాసుంవలికి న్యాయం చేయాలి
-బతికుండగానే చనిపోయినట్లు ఉత్తర్వులిచ్చిన వైనం
-తప్పుడు రికార్డులు సృష్టించిన వారిపై చర్యలకు యుఇఇయు డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సయ్యద్ మాసుం వలి

విద్యుత్ శాఖలో 19 సంవత్సరాల 10 నెలల 25 రోజులు పని చేసిన సయ్యద్ మాసుంవలి బతికి ఉండగానే చనిపోయినట్లు ఉత్తర్వులు ఇచ్చిన సంబంధిత అధికారిని తక్షణమే సస్పెండ్ చేసి బాధితునికి న్యాయం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) కర్నూలు జిల్లా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు పి.నాగరాజు, రీజినల్ గౌరవాధ్యక్షులు ఎండి.అంజిబాబు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖలో 19 యేళ్ల10 నెలల 25 రోజులు పని చేసిన సయ్యద్ మాసుంవలి బతికి ఉండగానే చనిపోయినట్లు ఉత్తర్వులు ఇవ్వడం ఏమిటి అని వారు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రివైజ్డ్ పెన్షన్ రూల్ 33-42 ప్రకారం కర్నూలు జిల్లా విద్యుత్ శాఖ కోడుమూరు సెక్షన్‌లో పనిచేస్తూ సయ్యద్ మాసం వలి (ఐడి నెంబర్ 17 884)2022 జూన్ 30 న ఉద్యోగ విరమణ చేశారన్నారు. ఆయన ఇపిఎఫ్ పెన్షన్‌కు అర్హుడు. రాష్ట్రం విడిపోయిన తర్వాత విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల ఇపిఎఫ్ జమలను తిరిగి 2015 మార్చి 1 నుండి 2022 జూన్ 30 వరకు మరల కడపకు మార్చారన్నారు. ఈ విషయాలన్ని తెలిసి కూడా కర్నూలు జిల్లా విద్యుత్ శాఖ ఫైనాన్స్ అకౌంట్స్ ఆఫీసర్ నిర్లక్ష్యంగా లైన్మెన్ సయ్యద్ మాసుం వలి చనిపోయాడని ఆయన ఇపిఎఫ్ అకౌంట్ కు జమ చేయాలని ఆయన సర్వీస్ ఎక్కడ బ్రేక్ చేయలేదని రాశారు. ఆయన సర్వీస్ రిజిస్టర్‌కు సంబంధించిన వివరాలు వారి జీతం స్లిప్పు, ఆధార్ కార్డు పాన్‌కార్డు, తదితర వివరాలన్ని ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ స్కీమ్ 1952 పేరా 57 ఇపిఎఫ్ అకౌంట్ ట్రాన్స్‌ఫర్ ఫారం పూరించి బతికి ఉన్న సయ్యద్ మాసం వలి చేతికే ఇపిఎఫ్ అకౌంట్ ట్రాన్స్‌ఫర్ చేయించుకోమని ఇచ్చారు. కర్నూలు జిల్లా విద్యుత్ శాఖ ఫైనాన్స్ అకౌంట్స్ ఆఫీసర్ 2025 ఫిబ్రవరి 6న ఉత్తర్వులు ఇవ్వడం మరి విచిత్రంగా ఉందన్నారు. ఈ విచిత్రాన్ని గమనించిన యూనియన్ నాయకులు వెళ్లి అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్‌ను కలవగా జరిగిన ఈ తప్పును సరి చేయాలని, ఈ తప్పు చేసిన కేస్ వర్కర్ (చైతన్య సీనియర్ అసిస్టెంట్)ను ఆదేశించారు. చేసిన తప్పును సరి చేయకుండానే కేస్ వర్కర్ సయ్యద్ మాసుం వలి లైన్మెన్ కు ఫోన్ చేసి బెదిరించారు. చైతన్య సీనియర్ అసిస్టెంట్ పైన తగిన చర్యలు తీసుకొని లైన్మెన్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అతనికి న్యాయం చేయకపోతే అతనిపై కేసు పెట్టి కోర్టుకు వెళ్తామని హెచ్చరించారు.

సేంద్రీయ సాగుతో మంచి ఆహారం : ఎఒ

ప్రజాశక్తి-సి బెళగల్ : సేంద్రీయ సాగు ఆహార పంటలతో ఆరోగ్యం మంచిగా ఉంటుందని ఎఒ మల్లేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సేంద్రీయ పద్ధతులతో సాగు చేసిన క్యాబేజీ, ఎర్రగడ్డ, ఆకు కూరలు, పూతగడ్డ, కొత్తిమీర వంటివి ఓ రైతు అమ్మకానికి వచ్చారు. ఇక్కడే ఎఒ మల్లేష్ కుమార్ పరిశీలన చేసి సేంద్రీయ సాగు పద్ధతులని వివరించారు. ప్రతి ఒక్కరూ ఆహార పంటలను, వాణిజ్య పంటలను, ఆదాయ పంటలను సేంద్రీయ సాగు పద్ధతులలోనే పండిస్తే ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు.

సోలార్ మోసాల నుండి రైతులను కాపాడాలి

కలెక్టర్‌కు ఎపి రైతు సంఘం వినతి

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్

ఆలూరు,పత్తికొండ నియోజకవర్గాలలో సోలార్ పేరుతో రైతుల భూములను తీసుకుంటున్న సోలార్ కంపెనీ మోసాల నుండి రైతులను కాపాడాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషకు ఎపి రైతు సంఘం ప్రతినిధి బృందం వినతిపత్రం సమర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ జిల్లా సహాయ కార్యదర్శి ఎ.కృష్ణ, జిల్లా నాయకులు జి. ఆంజనేయులు, రైతు నాయకులు వి.వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు. జి. రామకృష్ణ మాట్లాడుతూ ఆస్పరి ఆలూరు పత్తికొండ చిప్పగిరి హాలహర్వి హోళగుంద మండలాల్లో సోలార్ పరిశ్రమ కౌలుతో పాటు అతి తక్కువ ధరతో కొనుగోలు చేస్తూ రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. కౌలు పేరుతో 30 సంవత్సరాలు ఒక సంవత్సరానికి రూ.30వేల చొప్పున యిచ్చి తీసుకుంటున్నారన్నారు. రైతుల భూముల డాక్యుమెంట్స్ కూడా బలవంతంగా తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఉప్పు, సౌడు భూముల పేరుతో కారు చౌకగా తీసుకోవడం సరికాదన్నారు. ఈ భూములకు ప్రభుత్వం వేదవతి ప్రాజెక్ట్ నిర్మాణం చేసి భూములకు సాగునీరు అందిస్తే బంగారు పంటలు సాగు జరుగుతాయన్నారు. ఈ భూములకు లక్షలు విలువలు పలికే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ప్రాజెక్టుకు నిధులు కేటాయించడం లేదన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూములకు రూ.10 లక్షలు నుండి రూ.20 లక్షల వరకు ఇవ్వాలని డిమాండు చేశారు. రైతులకు మాయ మాటలు చెప్పి మధ్య దళారులతో రైతులపై వత్తిడితీసుకురావడం అరికట్టాలని వారు డిమాండ్ చేశారు. ఎకరాకు కౌలు రూ.50 వేలు ఇవ్వాలని లీజు కాల పరిమితి 10 సంవత్సరాలు మించ కుండా కలెక్టర్ చర్యలు తీసుకోవాలనికలెక్టర్ ను కోరారు. కలెక్టర్ రంజిత్‌బాష స్పందిస్తూ బాధిత రైతులకు తగిన న్యాయం జరిగేటట్లు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిర్వీర్యం

-నిరుద్యోగులను మోసం చేసిన కూటమి ప్రభుత్వం
-సూపర్‌సిక్స్ అమలు కోసం 12న 'యువతపోరు'
-కోడుమూరు ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ :ప్రయివేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు ప్రవేశపెడితే విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే ఫీజు రీయింబర్స్‌మెంటును, తదితర విద్యాపథకాలను అటకెక్కించారని వైసిపి కోడుమూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ఆదిమూలపు సతీష్ అన్నారు. సోమవారం కర్నూలులో 'యువత పోరు' పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ అమలు కోసం ఈనెల12 నిరసన చేపడుతున్నామని తెలిపారు. ప్రజల తరపున పోరాటానికి తాము ఎప్పుడూ సిద్దంగా ఉన్నామని, విద్యార్థి ,యువతకు మద్దత్తుగా 'యువత పోరు' కార్యక్రమానికి అందరూ సహకరించాలన్నారు. అసెంబ్లీలో ప్రశ్నించేవారు లేరని, విచ్చలవిడిగా అబద్దాలను కూటమి ప్రభుత్వం చెబుతుందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడుస్తున్నా ప్రజలకు ఏమి చేయలేదన్నారు. ఈ బడ్జెట్ లో విద్యా, వైద్య, నిరుద్యోగ భృతి కల్పించాలని డిమాండ్ చేశారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో జగనన్న గోరుముద్ద పేరుతో మెను ఏర్పాటు చేసి భోజనం ఏర్పాటు చేశారన్నారు. నిరుద్యోగులను కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. నిరుద్యోగ భృతి లేదని, రూ. 20 లక్షల ఉద్యోగాలు కలిపిస్తామని మోసం చేశారన్నారు. రెండు లక్షల మంది వాలంటీర్లను తొలగించారన్నారు. మెగా డిఎస్‌సి పేరుతో నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారని విమర్శించారు. ప్రతి జనవరిలో జాబ్ క్యాలెండర్ అన్న నారా లోకేష్... ఉద్యోగాలు కల్పించకపోతే చొక్కా పట్టుకోమన్నారని, ఇప్పుడేమి చేస్తున్నారని ప్రశ్నించారు. తల్లికి వందనం రూ.15 వేలు అందిస్తామని ఇప్పటికీ వాటిపై స్పష్టత లేదని, తల్లికి వందనం వస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారన్నారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడానికి వాళ్లకు అనుకూలమైన వ్యక్తులకు ఇచ్చి వ్యాపారం చేయడానికి చేస్తున్న ప్రయత్నాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. యువత పోరు కార్యక్రమంలో కోడుమూరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కర్నూలు జడ్పిటిసి ప్రసన్నకుమార్, కర్నూలు వైస్ ఎంపిపి నెహమియా, ఎంపిటిసిలు మద్దిలేటి, శేఖర్, అధికార ప్రతినిధి ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కొంతలపాడు శ్రీనివాసరెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షులు డి.వాసు, కోడుమూరు యువజనా విభాగం అధ్యక్షులు వెంకటేష్, కోడుమూరు సోషల్ మీడియా అధ్యక్షులు గిరిప్రసాద్, కోడుమూరు ప్రచార విభాగం అధ్యక్షులు వెంకటేశ్వరరెడ్డి, కోడుమూరు ఎస్‌సి సెల్ అధ్యక్షులు బొజ్జన్న, కోడుమూరు కార్మిక శాఖ విభాగం అధ్యక్షులు బోయ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

యువతపోరు పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడుతున్న డాక్టర్ ఆదిమూలపు సతీష్

బిసిలకు ముఖ్యమంత్రి పెద్దపీట: సోమిశెట్టి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జిల్లా తెలుగుదేశం పార్టీలో బిసి కులానికి చెందిన బిటి నాయుడుకు మరోమారు ఎమ్మెల్సీ స్థానాన్ని కేటాయిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బిసిలకు పెద్దపీట వేశారని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, బిసిసెల్ నాయకులు బేతం కృష్ణుడు అన్నారు. సోమవారం జిల్లా టిడిపి కార్యాలయం ఆవరణలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లుతో కలిసి పూలమాలలు వేసి శ్రద్ధాంజలిఘటించి నివాలులర్పించారు. తర్వాత బాణసంచా కాల్చి, తదుపరి జిల్లా పార్టీ కార్యాలయంలో కేక్‌ను కట్‌చేసి ఒకరికొకరు పంచుకున్నారు. వారు మాట్లాడుతూ టిడిపి బి.సి.ల పక్షపాతి అని చంద్రబాబు రుజువు చేశారనీ, బిటినాయుడు టిడిపి అంకితభావంతో పనిచేసిన విద్యావంతులని, అటువంటి వారిని గుర్తించి రెండు పర్యాయాలు పార్లమెంటుకు పోటీచేసే అవకాశం కల్పించిదన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా మరో అవకాశం ఇచ్చి చిత్తశుద్ధిని చాటుకున్నారన్నారు. పార్టీ కి చెందిన నాయకులు జె.తిరుపాలుబాబు, నాగరాజుయాదవ్, థరూర్ జేమ్స్, హనుమంతరావు చౌదరి, ఎస్.షేక్షావలి, జి. శ్రీదర్, ఎం. దేవరాజ్, ఎస్‌కె. అహ్మద్‌బాష, ప్రవీణ్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు నివాళి అర్పిస్తున్న విసి ప్రొఫెసర్ వెంకట బసవరావు

సామాజిక విప్లవకారిణి సావిత్రిబాయిపూలే

విసి ప్రొఫెసర్ వెంకట బసవరావు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సామాజిక విప్లవకారణి సావిత్రిబాయి ఫూలే అని రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ వి.వెంకట బసవరావు అన్నారు. సోమవారం సావిత్రిబాయిఫూలే 128వ వర్ధంతిని పురస్కరించుకొని రాయలసీమ యూనివర్సిటీలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వెంకట బసవరావు, రిజిస్టార్ ప్రొఫీసర్ విజయ్ కుమార్ నాయుడు, బిసి సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కంట్రోలర్ ఎగ్జామినేషన్ వెంకటేశ్వర్లు, బిసి ఉద్యోగుల సంఘం నాయకులు రమేష్ యాదవ్, జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి అన్వర్ బాష పాల్గొన్నారు.

బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యం

- ఉపాధి పెండింగ్ వేతనాలు చెల్లించాలి
- అడిగిన వారందరికీ పని కల్పించాలి
- వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్

ప్రజాశక్తి - దేవనకొండ

తొమ్మిది వారాలుగా కష్టపడి, ఎర్రని ఎండకు కష్టం చేసిన ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని, పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని తెర్నేకల్, దేవనకొండ, కుంకనూరు గ్రామాల సచివాలయాల ఎదుట వ్యకాస ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సచివాలయ కార్యదర్శులకు వినతిపత్రాలు అందజేశారు. వ్యకాస మండల కార్యదర్శి మహబూబ్ బాషా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్, సిఐటియు మండల కార్యదర్శి అశోక్, సీనియర్ నాయకులు బజారి మాట్లాడారు. రెండు నెలలకు పైగా చేసిన కష్టానికి కూలిలు ఇవ్వకుంటే ఉపాధి కూలీలు ఎలా బతకాలని ప్రశ్నించారు. ప్రభుత్వం కావాలనే పథకం ప్రకారం వేతనాలు ఇవ్వకుండా.. పని అడగకుండా ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కరువు ప్రాంతమైన కర్నూలు జిల్లాలో ఉపాధి హామీ చట్టం ద్వారా చాలామంది జీవనం సాగిస్తున్నారని, దీని కొనసాగించడంలో ప్రభుత్వాల పక్షపాత వైఖరిని అవలంబిస్తున్నాయని మండిపడ్డారు. పెండింగ్ వేతనాలు చెల్లించి, పని దినాలు పూర్తయిన వారికి అదనంగా పని దినాలు ఇవ్వాలని, పని ప్రదేశంలో వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కూలీల్లో ఎక్కువ పేదలు ఉన్నారని, అందరికీ భూమి, ఇల్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. రాబోయే రోజుల్లో గ్రామీణ కూలీల సమస్యలపై వ్యకాస ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళన చేపడతామని తెలిపారు. ఈ నెల 12న చలో విజయవాడకు పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు. ఉపాధి కూలీలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. వ్యకాస నాయకులు శ్రీనివాసులు, రామాంజనేయులు, లక్ష్మీరెడ్డి, హనుమంతు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. **ఆలూరు** గ్రామ పంచాయతీలో వ్యకాస మండల నాయకులు నాగరాజు, వీరేష్ అధ్యక్షతన ఉపాధి కూలీలు ధర్నా చేపట్టారు. వ్యకాస జిల్లా నాయకులు పి.హనుమంతు మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న 10 వారాల ఉపాధి కూలి డబ్బులను వెంటనే చెల్లించాలని కోరారు. పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, టెంట్లు, తాగునీరు సరఫరా చేయాలని, ఉపాధి హామీ చట్టంలో రాజకీయ జోక్యం ఉండకూడదని, అడిగిన వారందరికీ జాబ్ కార్డులు ఇచ్చి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆలూరు పంచాయతీ అధికారికి వినతిపత్రం అందజేశారు. వ్యకాస నాయకులు పంపావతి, ఎం.నాగరాజు, మల్లికార్జున, పవన్, మహానంది, ఈరన్న, నరసింహ, నాగప్ప పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)** మండలం పెసలబండ, దొడ్డనకేరి, మాంత్రికి గ్రామాల సచివాలయాల ఎదుట ఉపాధి కూలీలతో ఆందోళన చేపట్టారు. వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, వ్యకాస ఆధ్వర్యంలో ఈనెల 12న విజయవాడలో చేపట్టే భారీ ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. వ్యకాస నాయకులు సూరి, మండల అధ్యక్షులు రంగనాథ్, మండల నాయకులు కర్ణ, నాయకులు గోపాల్, గోవిందు, కమలనాథ్ పాల్గొన్నారు.

దేవనకొండలో ధర్నా చేపడుతున్న నాయకులు

ఆలూరులో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


ఆదోనిలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సదస్సులో మాట్లాడుతున్న వెంకటేశులు

'కూటమి' హామీలు అమలు చేయాలి

- రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు

ప్రజాశక్తి - ఆదోనిరూరల్

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం గత ఎన్నికలకు ముందు మహిళలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో సిఐటియు, ఐద్వా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదోనిలో సదస్సు నిర్వహించారు. ముందుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని.. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ నెలకు రూ.1,500 ఇస్తామని.. పొదుపు మహిళలకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని హామీఇచ్చిందని తెలిపారు. ఇంట్లో చదువుకునే ప్రతి బిడ్డకూ తల్లికి వందనం కింద రూ.15 వేలు ఇస్తామని చేసిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో వాగ్దానాల అమలు కోసం, మహిళల హక్కుల కోసం ప్రభుత్వాలపై పోరాడాలని కోరారు. పాండవగల్ సర్పంచి కె.ఉమాదేవి, అంగన్వాడీ యూనియన్ నాయకులు సోమక్క, ఐద్వా నాయకులు మునెమ్మ, నరసమ్మ, జయలక్ష్మి, నాగమ్మ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

అర్జీలకు సత్వర పరిష్కారం

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్

ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వారం వారం వస్తున్న అర్జీలను సంబంధిత అధికారులకు పంపుతున్నామని తెలిపారు. ఎప్పటిలోపు సమస్య పరిష్కారం చేస్తారో అర్జీదారులకు స్పష్టత ఇవ్వాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీనివాసరాజు, వేణు సూర్య, డిఎల్‌పిఒ నూర్జహాన్, ఆర్అండ్‌బి డిప్యూటీ ఇంజినీర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ సత్యవతి, డిప్యూటీ తహశీల్దార్ గుండాల నాయక్, ఆర్‌టిసి డిపో మేనేజర్ మహ్మద్ రఫీ పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు తప్పనిసరి : ఎఒ

ప్రజాశక్తి - చిప్పగిరి

విశిష్ట నమోదు క్యాంపును పరిశీలిస్తున్న ఎఒ

ప్రధానమంత్రి కిసాన్ నిధులు పొందే రైతులందరూ విశిష్ట గుర్తింపు సంఖ్యను తప్పనిసరిగా చేయించుకోవాలని, అందుకు ప్రతి గ్రామంలోనూ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామని ఎఒ జయలక్ష్మి తెలిపారు. సోమవారం రైతు సేవా కార్యాలయంలో విశిష్ట నమోదు క్యాంపును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మండలంలో పిఎం కిసాన్ నిధులు పొందే వారు 6,204 మంది రైతులు ఉన్నారన్నారు. ఇందులో 3,069 మంది మాత్రమే ఇప్పటివరకు విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందారని తెలిపారు. చేయించుకోని వారు దాదాపు సగం మంది ఉన్నారని, వారికోసం గ్రామాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆ క్యాంపుల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్లతో విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని సూచించారు. ఈ క్యాంపులను రైతులందరూ సద్వినియోగం చేసుకొని వారంలోపు విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని తెలిపారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లు రంగస్వామి, సుబ్బరాయుడు, మనోహర్ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో జిల్లాకు అన్యాయం : సిపిఐ

ప్రజాశక్తి - హోళగుంద

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని సిపిఐ మండల కార్యదర్శి పెద్దహ్యాట మారెప్ప విమర్శించారు. సోమవారం హోళగుంద ఎంపిడిఒ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. తహశీల్దార్ నిజాముద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఎఐటియుసి తాలూకా ఉపాధ్యక్షులు రంగన్న, కార్యకర్తలు వెంకన్న, సలాం సాబ్, హీనహిత్, మల్లయ్య, రాము పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న సర్పంచి పాల్ దినకరన్

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు

- సర్పంచి పాల్ దినకరన్

ప్రజాశక్తి - కౌతాళం

గ్రామస్తులు ఆరోగ్యంగా ఉండాలని పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సర్పంచి పాల్ దినకరన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. వైసిపి మండల కన్వీనర్ దేశాయ్ ప్రహ్లాదాచారి సహకారంతో పంచాయతీ ఆధ్వర్యంలో హనుమాన్ నగర్, జమ్మి చెట్టు వద్ద డ్రెయినేజీ సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. మురుగునీరు రోడ్డుపై ప్రవహించకుండా సిమెంట్ కల్వర్టు, పైపులైన్ వేసి సమస్యను పరిష్కరించామని చెప్పారు. అలాగే గతవారంలో దోమల నివారణకు ఫాగింగ్ మిషన్ చేయించామన్నారు. ప్రజలు కూడా పంచాయతీకి సకాలంలో ఇంటి పన్నులు, కుళాయి పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

మాట్లాడుతున్న నాయకులు

'కూటమి'కి రుణపడి ఉన్నాం

- టిడిపి నాయకులు

ప్రజాశక్తి - కౌతాళం

బడుగు, బలహీన వర్గాలైన బీసీ బోయ/వాల్మీకులను గుర్తించి బిటి.నాయుడుకు రెండోసారి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటామని టిడిపి నాయకులు మహాదేవ నాయుడు, నరసన్న, అయ్యప్ప, సిద్ధయ్య గొట్టూరు హుస్సేని, చిరంజీవి తెలిపారు. ఎమ్మెల్సీగా వాల్మీకి కులబాంధవులను ప్రకటించిన నేపథ్యంలో సోమవారం శ్రీ ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎమ్మెల్సీగా బడుగు, బలహీన వర్గాలకు చెందిన బిటి.నాయుడు, బీద రవిచంద్ర, గ్రీష్మకు ప్రకటించిన సందర్భంగా అధినాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి, సీనియర్ నాయకులు చూడి ఉల్లిగయ్య ఆధ్వర్యంలో బిటి.నాయుడు కుటుంబ సభ్యుల పేరుపై ఆలయంలో పూజలు నిర్వహించారు. తోవి శంకర్, బ్లడ్ బసవరాజు, ఉప్పలపాటి అర్జున్, కాసుల నరసప్ప పాల్గొన్నారు.

విద్యార్థినులకు పెన్నులు, ప్యాడ్లు పంపిణీ

ప్రజాశక్తి - నందవరం

నందవరం కస్తూరిబా గాంధీ పాఠశాల పదో తరగతి విద్యార్థినులకు రాణి అహల్యాబాయి హోల్కర్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం పెన్నులు, ప్యాడ్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ఎంఇఒ-2 రఘునాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాణి అహల్య బాయి ఉత్తర భారతదేశంలో కాశీ, మధుర తదితర దేవాలయాలను పునరుద్ధరించారని తెలిపారు. రాణి రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీబాయి లాంటి మాతృమూర్తులను ఆదర్శంగా తీసుకొని జీవితంలో ముందుకు సాగాలని చెప్పారు. విద్యార్థులు పరీక్షలను దృష్టిలో ఉంచుకుని మంచిగా చదువుకోవాలని, పరీక్షల్లో పాటించాల్సిన మెళకువలను విద్యార్థినులకు వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శైలజ, సంస్థ సభ్యులు వీరేష్, శ్రీహరి, గజేంద్ర, కనకవీడు రవి, సూరి, దామోదర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పెన్నులు, ప్యాడ్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

కాలువలో పడిన కారు

కాలువలో పడిన కారు

- తప్పిన పెను ప్రమాదం..!

ప్రజాశక్తి - కౌతాళం

చిన్న తప్పిదం వల్ల కారు కాలువలో పడింది. త్రుటిలో పెను ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటన సోమవారం ఉరుకుందలో చోటుచేసుకుంది. శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి సమీపంలో ఉన్న తుంగభద్ర కాలువ వద్ద కారును నిలిపి నీటితో శుభ్రం చేశారు. ఈ కాలువ వద్ద గ్రామస్తులు బట్టలు ఉతకడానికి, స్వామి దర్శనం కోసం వచ్చిన భక్తులు స్నానానికి అధిక సంఖ్యలో ఉంటారు. ఈ నేపథ్యంలో కారులో కూర్చున్న డ్రైవర్ బ్రేక్‌కు బదులు ఎక్సలేటర్ తొక్కడంతో ఆ కారు కాలువలోకి దూకింది. ప్రమాదవశాత్తు జరిగిన ఈ సంఘటనలో ఎవరికీ, ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో చుట్టుపక్కల ఉన్న భక్తులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కాలువ గట్టుపై ఎలాంటి రక్షణ గోడ కానీ, కంచె కానీ లేకపోవడంతో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కాలువ గట్టుపై కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రత : కమిషనర్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రత సాధ్యమవుతుందని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని గాంధీ సర్కిల్, షరాఫ్ బజార్, లక్ష్మీపేట ఏరియాలో పారిశుధ్య పనులను పరిశీలించారు. అలాగే పట్టణంలోని శ్రీనివాస సర్కిల్‌లో గల అన్న క్యాంటీన్‌లో అల్పాహారం పంపిణీని తనిఖీ చేశారు. ప్రజలతో అక్కడి శానిటేషన్ గురించి, పంపిణీ సమయం గురించి చర్చించారు.

అంతరాయానికి రైతులు సహకరించాలి

- విద్యుత్ శాఖ డిఇఇ విజయరాజు

ప్రజాశక్తి - మంత్రాలయం

విద్యుత్ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ డిఇఇ విజయరాజు కోరారు. సోమవారం ఆయన మాట్లాడారు. కర్నూలు నుంచి గూడూరుకు వచ్చే 132 కెవి లైన్ కండక్టర్‌ను మార్చుతున్నారని, ఈ నేపథ్యంలో ఈనెల 11 నుంచి 15 రోజుల వరకు రైతులకు 3 ఫేజ్ విద్యుత్‌కు స్వల్పంగా అంతరాయం ఉంటుందని తెలిపారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు రైతులకు 3 ఫేజ్ విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని చెప్పారు. రైతులు ఇబ్బందులు పడకుండా ముందస్తు సమాచారం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని రైతులు సహకరించాలని కోరారు.

హామీల అమలుకు సంఘటిత పోరాటం

- రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురుశేఖర్

ప్రజాశక్తి - గోనెగండ్ల

రజకులకు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం సంఘటితంగా పోరాడాలని ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్, గౌరవాధ్యక్షులు హనుమంతు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కరుణాకర్ తెలిపారు. సోమవారం గోనెగండ్ల రజక వీధిలో రజక వృత్తిదారుల సంఘం మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. శివ రాముడు అధ్యక్షత వహించారు. ముందుగా సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో రజక కార్పొరేషన్‌కు రూ.1000 కోట్లు కేటాయించి సొసైటీలు ఏర్పాటు చేసి బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వాలని కోరారు. ఈనెల 22న కోడుమూరులో జరిగే సంఘం 6వ మహాసభలకు గోనెగండ్ల మండలంలో ఉండే రజక వృత్తిదారులు, ఉద్యోగులు, మేధావులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక

అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా కులుమాల నరసింహులు, అధ్యక్షులుగా శివరాముడు, ఉపాధ్యక్షులుగా వాసు, శేఖర్, రాజేష్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, సహాయ కార్యదర్శిగా నరసింహులు, మధు, నరసన్నతో పాటు మరో 15 మందిని ఎన్నుకున్నారు.

మాట్లాడుతున్న గురు శేఖర్

'పరీక్ష కేంద్రానికి బస్సు సౌకర్యం కల్పించాలి'

ప్రజాశక్తి - హోళగుంద

మండలంలోని ఇంగలదహాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు పెద్దహరివాణం పరీక్ష కేంద్రానికి వెళ్లేందుకు ఈనెల 17 నుంచి 31 వరకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు ఎస్ఎఫ్ఐ నాయకులు మల్లికార్జున, కెసి.తిమ్మారెడ్డి యూత్ అసోసియేషన్ సభ్యులు పంపాపతి వినతిపత్రం అందజేశారు. సబ్ కలెక్టర్ స్పందిస్తూ... బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తామని హామీఇచ్చారు.

నేటి నుంచి మూగి తాత దర్గా ఉరుసు ఉత్సవాలు

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండలో వెలసిన దిగంబర దీవానే మూగితాత దర్గా ఉరుసు ఉత్సవాలు మంగళవారం నుంచి గంధంతో ప్రారంభమై గురువారం జియారత్ కార్యక్రమంతో ముగియనున్నట్లు దర్గా కమిటీ నిర్వాహకులు సోమవారం తెలిపారు. స్వామివారి ఉరుసు బుధవారం జరగనున్నట్లు, భక్తాదులకు అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దర్గాను రంగులతో విద్యుద్దీపాలతో అలంకరించినట్లు చెప్పారు.

శ్రీమఠంలో రాఘవేంద్రుని నిజ బృందావన దర్శనం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో రాఘవేంద్రుని నిజ బృందావన దర్శన భాగ్యం భక్తులకు కల్పించారు. సోమవారం ఏకాదశి తిథి సందర్భంగా రాఘవేంద్రుని బృందావనాన్ని నిర్మాల్యం చేసి కాషాయ వస్త్రాలతో, తులసి మాలతో అందంగా అలంకరించారు. పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థులు రాఘవేంద్ర స్వామి ఆరాధ్య దైవమైన మూల రాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాఘవేంద్రుని బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు ఇచ్చారు. ఏకాదశి తిథి కావడం వల్ల స్వామి వారికి నైవేద్య సమర్పణ లేకపోవడంతో భక్తులకు కూడా భోజన సదుపాయం, పరిమళ ప్రసాద విక్రయం ఉండదు.

'యువత పోరు'తో కూటమికి హెచ్చరిక

- మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ వైసిపి ఆధ్వర్యంలో చేపట్టనున్న 'యువత పోరు'ను విజయవంతం చేసి కూటమి ప్రభుత్వానికి హెచ్చరిక పంపుదామని ఆదోని మాజీ ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో వైసిపి ఆధ్వర్యంలో చేపట్టే 'యువత పోరు' గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 12న నిర్వహించే 'యువత పోరు' కూటమి ప్రభుత్వానికి ఓ హెచ్చరికగా ఉండాలన్నారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి అధికారంలోకి వచ్చి 9 నెలలవుతున్నా ఒక్క హామీని కూడా పూర్తిగా నెరవేర్చలేదన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, నిరుద్యోగులను మోసం చేసిందని మండిపడ్డారు. అమ్మ ఒడి పథకాన్ని తల్లికి వందనంగా మార్చి తొలి ఏడాది ఎగనామం పెట్టారని విమర్శించారు. ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.4,200 చెల్లించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. కళాశాల యాజమాన్యాలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఇబ్బంది పెడుతున్నాయని తెలిపారు. ఇక 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మోసం చేశారని మండిపడ్డారు. ఈనెల 12న ఉదయం 10 గంటలకు వైసిపి కార్యాలయం నుంచి 'యువత పోరు' ర్యాలీ ప్రారంభమై సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు కొనసాగుతుందని చెప్పారు. విజయవంతం చేయాలని కోరారు. వైసిపి సీనియర్ నాయకులు చంద్రకాంత్ రెడ్డి, రామలింగేశ్వర్, వైస్ ఛైర్మన్ నరసింహులు పాల్గొన్నారు. **మంత్రాలయంలో** గోడపత్రికలను విడుదల చేశారు. వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి మాట్లాడారు. విద్యార్థి, యువత సమస్యల పరిష్కారానికి కర్నూలులోని గౌరీగోపాల్ సర్కిల్ నుంచి ర్యాలీగా కలెక్టరేట్ చేరుకుని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. వైసిపి మండల అధ్యక్షులు భీమిరెడ్డి, జిల్లా కార్యదర్శి విశ్వనాథ రెడ్డి, వైసిపి యూత్ విభాగం అధ్యక్షులు నరవ రాజశేఖరరెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షులు దయ్యాల మహబూబ్, లక్ష్మన్న, గురు, నరసింహ ఆచారి, బందే నవాజ్, మహబూబ్ పాల్గొన్నారు. **గోనెగండ్లలో** వైసిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి 'యువత పోరు' గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి టికె.బందే నవాజ్ మాట్లాడారు. యువత, నిరుద్యోగుల సమస్యలపై ఈనెల 12న కలెక్టరేట్ వద్ద వైసిపి ఆధ్వర్యంలో చేపట్టే 'యువత పోరు'ను జయప్రదం చేయాలని కోరారు. వైసిపి నాయకులు గోవిందు, పద్మనాభం, మాబు వలీ, షరీఫ్, ఇమ్రాన్, బగిలి రఫీ, బాబూలాల్, కడపల ఉరుకుందు, ఉస్మాన్, రంగన్న పాల్గొన్నారు.

ఆదోనిలో గోడపత్రికను విడుదల చేస్తున్న సాయిప్రసాద్ రెడ్డి


మంత్రాలయంలో మాట్లాడుతున్న ప్రదీప్‌రెడ్డి

గోనెగండ్లలో గోడపత్రికను విడుదల చేస్తున్న నాయకులు

'ప్రకృతి' కూరగాయలతో మంచి ఆరోగ్యం'

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలను పరిశీలిస్తున్న అధికారులు

ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరలు వాడడం వల్ల మంచి ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని, ఆ దిశగా వ్యవసాయ ఉత్పత్తుల సాగుకు రైతులు ముందుకు రావాలని ఎంపిడిఒ అల్లాబకాష్, ఏపీవో జుబేర్ అహ్మద్ రైతులకు తెలిపారు. సోమవారం మండల కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ అధికారుల సూచనల మేరకు రైతుల భాగస్వామ్యంతో పండించిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు టమోటా, పచ్చిమిర్చి, ముల్లంగి, క్యారెట్‌తో పాటు ఆకుకూరలను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడారు. ప్రజలందరూ ఆరోగ్యవంతులుగా ఉండాలంటే ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలను, ఆకుకూరలను తప్పనిసరిగా వాడాలని, బీపీ, షుగర్ ఇవన్నీ ఏమీ ఉండవని తెలిపారు. మందులతో సాగు చేసిన కూరగాయలను విడిచిపెట్టి ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసిన కూరగాయలు, ఆకుకూరలను తినడం అలవాటు చేసుకోవాలని ప్రజలను కోరారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రంగయ్య, ఝాన్సీ, రాజశేఖర్ పాల్గొన్నారు.

పూలే ఆశయాలను సాధిద్దాం

- బీసీ ఫెడరేషన్ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

పూలే ఆశయాలను సాధిద్దామని బీసీ ఫెడరేషన్ నాయకులు తెలిపారు. సోమవారం సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆదోని డివిజన్ బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు అధ్యక్షతన స్థానిక కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డివిజన్ వైస్ ప్రెసిడెంట్ కత్తి హనుమంత రావు, గౌరవ సలహాదారులు దేవిశెట్టి ప్రకాష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు మాట్లాడారు. సావిత్రి బాయి పూలే నూతన వ్యవస్థ కోసం, ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి పోరాటం చేశారని తెలిపారు. డివిజన్ గౌరవ సలహాదారులు బండారి రాజేశ్వరరావు, పట్టణ జాయింట్ సెక్రటరీ బెస్త ప్రకాష్, వికలాంగుల నాయకులు వెంకటేష్, శ్రీనివాసులు, కత్తి రవి ఉన్నారు. **హాలహర్వి** మండలంలోని నిట్రవట్టి గ్రామంలోని సీజనల్ హాస్టల్‌లో ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష సౌజన్యంతో 'ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ' ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. ఉపాధ్యాయులు కె.అయ్యనగౌడ్, కేర్ టేకర్ బి.లక్ష్మన్న పాల్గొన్నారు.

రమణీయం.. బసవేశ్వర స్వామి రథోత్సవం

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని జంపాపురం గ్రామంలో బసవేశ్వర స్వామి రథోత్సవం సోమవారం రమణీయంగా సాగింది. ముందుగా ఆలయ అర్చకులు ఈశ్వరయ్య ఆధ్వర్యంలో స్వామివారికి ఫల, పుష్ప అలంకరణ, ఆకు పూజ, మహా మంగళ హారతులు, తుంగభద్ర జలాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలు సీతారామిరెడ్డి, లేపాక్షి రెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణమంతా విద్యుద్దీపాలతో అలంకరించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. ప్రత్యేకంగా రాంపురం గ్రామం నుంచి స్వామివారికి తమలపాకులు, అరటి చెట్లతో ప్రత్యేకంగా పూజలు చేశారు. జంపాపురం గ్రామ ఆరాధ్య దైవం కావడంతో గ్రామంలోని ప్రతి ఇంటిలో సాయంత్రం అశేష జనవాహిని మధ్య గుడి నుంచి గ్రామ పురవీధుల గుండా రథోత్సవాన్ని లాగారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా కోసిగి సిఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. వైసిపి, టిడిపి నాయకులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

వైద్య సిబ్బంది నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలి

- న్యాయవాది అడ్డాకుల తిమ్మప్ప

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ప్రభుత్వాస్పత్రిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని న్యాయవాది అడ్డాకుల తిమ్మప్ప కోరారు. సోమవారం తహశీల్దార్ శేష ఫణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలో ఉన్న మాచాని గంగన్న ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగుల పట్ల అక్కడ కొంతమంది వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రోగులకు సరయిన వైద్యం అందించడం లేదని చెప్పారు. ఈనెల 9న ఉదయం ప్రసవం కోసం వచ్చిన సువార్తమ్మ (ప్రశాంతి)కు సాధారణ కాన్పు చేసి శిశువును నిర్లక్ష్యం చేయడం వల్ల పుట్టిన మగ శిశువు మరణించినట్లు తెలిపారు. శిశువుకు ఎలాంటి అనారోగ్య సమస్యలూ లేకపోయినా ప్రసవం చేయాల్సిన వైద్యులు లేకపోవడం, అక్కడ ఉన్న స్టాఫ్ నర్సులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల, కాన్పు చేయడం వల్ల శిశువు మరణించినట్లు చెప్పారు. ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని ప్రభుత్వం ఒకవైపు చెబుతుంటే.. ఇక్కడ సిబ్బంది మాత్రం కాన్పు సమయాల్లో గైనకాలజిస్టులు, పిల్లల డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో ఇలాంటి మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ఇలాంటి సంఘటనలు గతంలోనూ జరిగినా ఇక్కడ ఉన్న వైద్య సిబ్బందిలో మార్పురావడం లేదన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల మరణాలతో ఆడుకోవడం ఇక్కడ సిబ్బందికి సాధారణంగా మారిందని మండిపడ్డారు. విధులకు నిర్లక్ష్యంగా హాజరవుతున్న వారిపై విచారణ చేసి ఉద్యోగం నుంచి తొలగించి, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ప్రజాసంఘాల నాయకులు ఓంకార్, రాజీవ్, రాజు పాల్గొన్నారు.

కనుల పండువగా వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - ఆస్పరి

వాల్మీకిని దర్శించుకుంటున్న గ్రామస్తులు

మండలంలోని చిరుమాన్‌దొడ్డి గ్రామంలో ఆదికవి వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపనను సోమవారం వాల్మీకి నాయకులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించారు. గత మూడు రోజుల నుంచి వేదపండితులు మల్లికార్జున స్వామి వాల్మీకి విగ్రహానికి ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. తెల్లవారుజామున 3.25 నుంచి 4.15 గంటల వరకు మకర లగ్నంలో యంత్ర స్థాపన, శ్రీవాల్మీకి మహర్షి నూతన శిలా విగ్రహ ప్రతిష్టాపన చేపట్టారు. వాల్మీకి మహర్షికి విశేష అభిషేకం, అలంకారం, శ్రీనింబ లక్ష్మి సమేత అశ్వత్థ నారాయణ స్వామి కల్యాణం, జాహాది హోమం, ఉదయం 10.15 నుంచి 11.05 గంటల వరకు పుష్యమి నక్షత్రయుక్త వృషభలగ్న శుభ పుష్కరాంశంలో వాల్మీకి మహర్షి శిలా, విగ్రహ ప్రాణ ప్రతిష్ట చేశారు. అనంతరం పూర్ణాహుతి, కుష్మాండబలి, మహా మంగళహారతి తదితర పూజలు చేశారు. మహర్షి విగ్రహాన్ని తిలకించడానికి పెద్దఎత్తున భక్తులు రావడంతో ప్రాంగణమంతా కిటకిటలాడింది. గ్రామంలో వచ్చిన భక్తాదులకు అన్నదానం ఏర్పాటు చేశారు.